సాక్షి
అనకాపల్లి
బుధవారం । 27 । మార్చి । 2024




అన్నదాతల్లో ఆనందం

ధాన్యం ధర ఈ ఏడాది పెరిగింది. దిగుబడులు సైతం మెరుగుపడడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 8లో

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదురోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 33.2, కనిష్టంగా 32.6 డిగ్రీలు, తేమ 70 నుంచి 76 శాతం, గాలి గంటకు 8 కి.మీ. వేగంతో వీస్తుందన్నారు.



న్యూస్‌రీల్

వేసవి నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: వేసవిలో గ్రామాలు, పట్టణాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్రామీణ నీటిపారుదల శాఖ, పంచాయతీ, పురపాలక, నగర పాలక అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు, పట్టణాలలో పరిస్థితులను గమనిస్తూ ఇంజినీరింగ్ సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. భూగర్భ నీటి మట్టాలను అంచనా వేస్తూ కార్యాచరణ అమలు చేయాలన్నారు. జిల్లాలో మరమ్మతులకు గురైన 51 బోరు బావులను యుద్ధప్రాతిపదికన బాగు చేయాల్సిందిగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మండల, గ్రామ స్థాయిలో వాస్తవ పరిస్థితులను స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా తెలుసుకోవాలన్నారు. ఈ విషయంలో స్థానిక సంస్థలు తగిన విధంగా స్పందించాలన్నారు. అవసరమయ్యే నీళ్ల ట్యాంకుల గురించి ముందుగానే జాగ్రత్తపడాల్సిందిగా సూచించారు. నీటి వాడకం, చెరువులు, కుంటలను పరిరక్షించుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నియమావళి అమలులో ఉపేక్షించొద్దు : ఎస్పీ మురళీకృష్ణ



సమీక్షిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

చోడవరం రూరల్: రాజకీయ పక్షమేదైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే ఉపేక్షించొద్దని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి స్థానిక పోలీస్ సర్కిల్ స్టేషన్‌లో చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని సీఐలతో ఆయన సమీక్షించారు. ఆయా రాజకీయ పక్షాలకు ముందస్తుగా తెలియజేసి, నియమావళిని అతిక్రమిస్తే ఎంతటి వారైనా వెనక్కి తగ్గవద్దని సూచించారు. ఉల్లంఘనుల పట్ల ఎటువంటి ఉదాసీనత వద్దని, కఠిన చర్యలు తీసుకోవలసిందేనని తేల్చి చెప్పారు. ఎన్నికల చెక్‌పోస్టులతో పాటు డైనమిక్ చెక్‌పోస్టులను ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టడానికి మద్యం, సారా, మత్తు పదార్థాల అక్రమ రవాణాతోపాటు అధిక మొత్తంలో డబ్బు, ఇతరత్రా ఉచిత కానుకలు వంటివి తరలించడం, పంపిణీ చేయడాన్ని ఎప్పటికప్పుడు విస్తృత దాడులు చేసి బాధ్యులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయాలని సూచించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేయాలన్నారు. ఎటువంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలని వారికి చెప్పాలన్నారు. అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు బి.శ్రీనివాసరావు(చోడవరం) బి.సి.హెచ్.స్వామి నాయుడు (కె.కోటపాడు), ఎల్.అప్పలనాయుడు(కొత్తకోట) పాల్గొన్నారు.

నూకాంబిక జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ సుజాత

అనకాపల్లి: ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు, గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత అన్నారు. దేవాలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏప్రిల్ 22 నుంచి అమ్మవారి మూలవిరాట్ దర్శనం భక్తులకు కల్పిస్తామన్నారు. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం జరుగుతోందని, ప్రస్తుతం భక్తులకు బాలాలయంలో అమ్మవారి దర్శనభాగ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి జాతర ఏప్రిల్ 7 రాత్రి జరగనుందన్నారు. 8న కొత్త అమావాస్య, 9న ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, తాగునీటి వసతి, వివిధ స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ, ప్రసాద వితరణ చేపడతామన్నారు. జాతరకు సుమారుగా లక్ష మంది భక్తులు వస్తారన్న అంచనాతో బాలాలయంలో అమ్మవారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఏసీ సుధారాణి, ఆలయ ఈవో బండారు ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీలకే అగ్రపీఠం

- జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదు వెనుకబడిన వర్గాలవారికే..
- కొప్పుల వెలమలకు అనకాపల్లి పార్లమెంట్, మూడు అసెంబ్లీ టికెట్లు
- బూడి ముత్యాలనాయుడు, అనురాధల ఎంపికతో జిల్లా అంతటా హర్షాతిరేకాలు

సాక్షి, అనకాపల్లి: బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదు బ్యాక్ బోన్.. ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచూ చెప్పే మాట. చెప్పడమే కాదు చేసి చూపించారు.. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదింట బీసీ వర్గాలకు చెందిన నేతలను అభ్యర్థులుగా ఎంపిక చేసి తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. అనకాపల్లి ఎంపీ సీటుతోపాటు నర్సీపట్నం, పెందుర్తి, మాడుగుల, అనకాపల్లి, చోడవరం అసెంబ్లీ టికెట్లు బీసీలకు కేటాయించారు. ఇందులో అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా తాజాగా ప్రకటించిన బూడి ముత్యాలనాయుడితోపాటు నర్సీపట్నం, పెందుర్తి, మాడుగుల అసెంబ్లీ అభ్యర్థులు పెట్ల ఉమాశంకర గణేష్, అదీప్ రాజు, ఈర్లె అనురాధ కొప్పుల వెలమ కులస్తులు. ఉత్తరాంధ్రలో వెనుకబడిన సామాజికవర్గమిది. ఉమ్మడి విశాఖలో కొప్పుల వెలమలకు కూటమి పార్టీలు ఒక్క ఎంపీ సీటూ కేటాయించలేదు. తన కుమారుడికి టికెట్ ఇవ్వాలని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కోరినా టీడీపీ పట్టించుకోకుండా కొప్పుల వెలమలపై వారికున్న చిన్న చూపును బయటపెట్టుకుంది. కడప జిల్లాలో ఓసీ వెలమకు చెందిన సి.ఎం.రమేష్‌ను అనకాపల్లి ఎంపీ స్థానానికి ఎంపిక చేసి బీజేపీ తన నైజం బయటపెట్టుకుంది.

తారువలో సంబరాలు

దేవరాపల్లి: అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడును, మాడుగుల అసెంబ్లీ అభ్యర్థిగా ఈర్లె అనురాధను అధిష్ఠానం ప్రకటించడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం బూడి స్వగ్రామం తారువకు నియోజకవర్గం వ్యాప్తంగా అధిక సంఖ్యలో తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు జరిపారు.

తండ్రీ తనయలను ఘనంగా సత్కరించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళల కోలాట ప్రదర్శనలు, తీన్‌మార్ వాయిద్యాలతో తారువలో పండగ వాతావరణం నెలకొంది. జై జగన్, జైజై జగన్ నినాదాలతో తారువ మార్మోగింది.



తారువలో అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు స్వీట్లు తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

లోకల్ బీసీ వెలమ వెర్సెస్ నాన్ లోకల్ ఓసీ వెలమ

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు స్థానికతకే అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఎక్కువగా కాపు, గవర, వెలమ కులస్తులే ఎంపీగా పోటీ చేస్తున్నారు. నాన్‌లోకల్ అభ్యర్థులను ఇక్కడి ప్రజలు తిరస్కరిస్తున్నారు. గతంలో పీఆర్‌పీ నుంచి అనకాపల్లి ఎంపీగా పోటీ చేసిన చిరంజీవి బావ అల్లు అరవింద్‌ను ఓడించారు. అప్పుడు కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన కొప్పుల వెలమకు చెందిన సబ్బం హరిని ఇక్కడి ప్రజలు గెలిపించారు. 2009 తరువాత మళ్లీ అనకాపల్లి పార్లమెంట్ బరిలో లోకల్ వెర్సస్ నాన్‌లోకల్ పోటీ నెలకొంది. వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడు బరిలో దిగితే.. కూటమి నుంచి బీజేపీ అభ్యర్థిగా సీఎం రమేష్ పోటీ చేస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో కొప్పుల వెలమ సామాజికవర్గం ఓట్లకు గేలం వేయడానికి చంద్రబాబు కూటమి ఎత్తుగడ వేసింది. కానీ సీఎం రమేష్ ఓసీ వెలమ కు చెందినవారు. ఉత్తరాంధ్రలో ఉన్న కొప్పుల వెలమ, రమేష్ ఓసీ వెలమ ఒకటి కాదు. రానున్న ఎన్నికల్లో లోకల్ వెర్సస్ నాన్‌లోకల్ పోటీ ఉంటుంది. కొప్పుల వెలమలకు ప్రాధాన్యం ఇచ్చిన వైఎస్సార్‌సీపీ చిత్తశుద్ధిని, విస్మరించిన ప్రతిపక్ష కూటమి దగాకోరుతనాన్ని బీసీలు కచ్చితంగా గుర్తు పెట్టుకుంటారు.

వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా బూడి

- మాడుగుల అసెంబ్లీ అభ్యర్థిగా ఈర్లె అనురాధ



ముత్యాలనాయుడు



ఈర్లె అనురాధ

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త, అభ్యర్థిగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును, మాడుగుల అసెంబ్లీ సమన్వయకర్త, అభ్యర్థిగా ఈర్లె అనురాధను నియమించారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

వార్డు మెంబర్‌గా మొదలైన బూడి ప్రస్థానం

వార్డు సభ్యుడిగా రాజకీయ జీవితం ప్రారంభించిన బూడి ముత్యాలనాయుడు.. సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, ఎంపీపీగా, జెడ్పీటీసీగా పనిచేశారు. 2014, 2019లో వరుసగా వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రభుత్వ విప్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పదవులు ఆయనను వరించాయి. ఇటీవల వైఎస్సార్‌సీపీ విడుదల చేసిన అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో మాడుగుల అభ్యర్థిగా ఆయనను ప్రకటించారు. దాన్ని మార్పు చేస్తూ వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్తగా, అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడిని మంగళవారం అధికారికంగా ప్రకటించారు. మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తగా, అభ్యర్థిగా బూడి కుమార్తె ఈర్లె అనురాధను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అంచలంచెలుగా ఎదిగిన అనురాధ

వైఎస్సార్‌సీపీ మాడుగుల సమన్వయకర్తగా నియమితులైన ఈర్లె అనురాధ ప్రస్తుతం కె.కోటపాడు జెడ్పీటీసీగా.. అనకాపల్లి జిల్లా పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా.. జిల్లా పరిషత్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. దివంగత సీఎం వై.ఎస్. రాజశేఖరరెడ్డి 2003లో నిర్వహించిన పాదయాత్రలో చోడవరం మండలం లక్కవరం నుంచి కె.కోటపాడు మండలం ఆనందపురం వరకూ ఆయనతో కలిసి నడిచారు. చిన్నతనం నుంచి తాతయ్య బూడి వెంకునాయుడు, తండ్రి బూడి ముత్యాలనాయుడులను స్ఫూర్తిగా తీసుకొని ప్రజల్లో మెలిగేవారు. ఆమె భర్త ఈర్లె గంగునాయుడు (నాని) మాజీ జెడ్పీటీసీ సభ్యుడు.

సామాన్యుడికీ, ధనవంతుడికీ మధ్య పోరు

- అంతిమ విజయం వైఎస్సార్‌సీపీదే
- సంక్షేమాభివృద్ధే మాకు శ్రీరామరక్ష
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: అనకాపల్లి పార్లమెంట్ స్థానంలో ఎన్నికలు సామాన్యుడికి–ధనవంతుడికి, లోకల్–నాన్‌లోకల్ మధ్య జరుగుతున్న పోరాటమని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అభివర్ణించారు. తారువలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి జనబలం ముందు నిలవలేని మూడు పార్టీలు డబ్బుతో గెలవాలని సి.ఎం.రమేష్‌ను కడప నుంచి దిగుమతి చేసుకొని ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా నిలబెడుతున్నాయన్నారు. అనకాపల్లి ఎంపీ స్థానానికి గతంలో పోటీ చేసిన స్థానికేతరులు అల్లు అరవింద్, నూకారపు సూర్యప్రకాశరావులకు పట్టిన గతే రమేష్‌కు పడుతుందన్నారు. సామాన్య రైతు కుటుంబానికి చెందిన తనను అక్కున చేర్చుకొని శాసనసభ్యుడిని చేసి డిప్యూటీ సీఎం స్థాయికి తీసుకువచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేసే అవకాశం కల్పిస్తున్నారని, ఆయనకు తమ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుందన్నారు. నిత్యం ప్రజలతో మమేకమయ్యే తనకు అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ఉప ముఖ్యమంత్రిగా తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపగలిగానన్నారు. స్థానికేతరుడైన కూటమి అభ్యర్థి సీఎం రమేష్ వెలమ దొర సామాజిక వర్గానికి చెందినవాడు కాగా, తాను సామాన్య కొప్పుల వెలమ సామాజిక వర్గానికి చెందిన వాడినన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి తమ గెలుపునకు శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. తనను ఆదరించినట్టే తన కుమార్తె అనురాధను ఆశీర్వదించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి తనిఖీ



ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయం పక్కన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను ఆయన మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు ఎన్నిక నియమావళి అనుసరిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

నారసింహా.. శరణు శరణు

- సింహగిరిపై నృసింహ మహా యజ్ఞానికి శ్రీకారం
- నేటి నుంచి యజ్ఞం ప్రారంభం
- నేడు శారదా పీఠాధిపతుల రాక



పుట్టమన్నుని శిరస్సుపై పెట్టుకుని ఆలయంలోకి తీసుకెళ్తున్న స్థానాచార్యులు, అర్చకులు

సింహాచలం: సింహగిరిపై సుదర్శన నారసింహ మహా యజ్ఞానికి మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. తొలుత సీలాద్రిగుమ్మం వద్ద అర్చకులంతా రుత్విక్ వరణం, ఉత్సవాంగీకారం జరిపారు. అనంతరం చక్రపెరుమాళ్లను పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధిగా త్రిపురాంతక స్వామి ఆలయ సమీపంలో ఉన్న పుట్ట బంగారాన్ని మండపం వద్దకు తీసుకెళ్లారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ పుట్టమన్నును శిరస్సుపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకెళ్లి బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం చక్రపెరుమాళ్‌ని, పుట్టమన్నుని యాగశాలలోకి తీసుకెళ్లారు. ఇక్కడి వేదికపై చక్రపెరుమాళ్లని అధిష్ఠింపజేసి, తదుపరి పాలికల్లో పుట్టమన్నుని వేసి అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ @ రూ.10వేల కోట్లు

- ఆదాయార్జనలో ఆల్‌టైం రికార్డ్

తాటిచెట్లపాలెం: భారతీయ రైల్వేలో వాల్తేర్ డివిజన్ ఆల్‌టైం రికార్డ్ సాధించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.10 వేల కోట్ల ఆదాయంతో రికార్డ్ సృష్టించింది. ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఐదు రోజుల ముందే ఈ రికార్డ్ సాధించడం గమనార్హం. ఈ సందర్భంగా సిబ్బంది, అధికారులను డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ అభినందించారు. మార్చి 26వ తేదీ వాల్తేర్ డివిజన్ చరిత్రలో నిలిచిపోయే రోజని, ఆర్థిక సంవత్సరానికి ముందే రికార్డు సాధించడం గర్వంగా ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే సుమారు 10 శాతం అధికంగా ఆదాయం సంపాదించినట్లు ఆయన వెల్లడించారు. అధికారులు, సిబ్బంది పనితీరుతో ఈ రికార్డ్ సాధ్యమైందని డీఆర్ఎం తెలిపారు.

పొరపాటున పనికిమాలిన జనసేనలో చేరాను

- మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి

తాడేపల్లి: పాయకరావుపేటకు చెందిన మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లక్ష్మీ శివకుమారి మాట్లాడుతూ.. దివంగత మహానేత వైఎస్సార్ నాకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. చంద్రబాబు మాకు మాయమాటలు చెప్పి గతంలో టీడీపీలోకి తీసుకున్నారు. బిల్లుల పాస్ కోసం మమ్మల్ని మోసం చేసి పార్టీలోకి తీసుకున్నారు. చంద్రబాబు మోసం తెలిసి టీడీపీ నుండి బయటకు వచ్చాం. పొరపాటున పనికిమాలిన జనసేనలో చేరాను. కానీ పవన్ దిగజారిన రాజకీయాలు చేస్తున్నారు. చంద్రబాబు విదిల్చే 24 సీట్ల కోసం ఇంతగా దిగజారుతారనుకోలేదు. జనసేనలో ఉన్న వారంతా టీడీపీ కోసం పని చేస్తున్న వారే. ఆ సంగతి తెలిసి నేను జనసేన వీడి వైఎస్సార్‌సీపీలో చేరాను. పుట్టింటికి చేరినట్టుగా ఉంది. సీఎం జగన్ పేద ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారు. తండ్రికంటే ఎక్కువగా సీఎం జగన్ సంక్షేమం అందిస్తున్నారు. మళ్లీ మళ్లీ జగనే సీఎం అని ప్రజలంతా నమ్ముతున్నారు.. అని చెప్పారు.



అగ్ర వర్ణాల పేదల ‘నేస్తం’..

అన్ని వర్గాలకూ స్నేహ హస్తం



వైఎస్సార్ కాపునేస్తం లబ్ధిదారులకు చెక్‌ను అందజేస్తున్న జేసీ జాహ్నవి (ఫైల్)

కాపులంటే చంద్రబాబుకు కరివేపాకులు. రిజర్వేషన్ల పేరిటే కాదు.. దగాకోరు హామీలతోనూ సున్నం పెడితే.. సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారిని అక్కున చేర్చుకున్నారు. మాట ఇవ్వకపోయినా కాపు నేస్తంతో స్నేహ హస్తం అందించారు. ఇతర అగ్రవర్ణ పేదలకు సైతం ఈబీసీ నేస్తం సాయమందించి ఆపద్బాంధవుడయ్యారు.

- మేనిఫెస్టోలో చెప్పిన మాట కంటే మిన్నగా మేలు
- కాపు నేస్తం, ఈబీసీ నేస్తం కింద ఏటా రూ.15 వేల సాయం
- 45 నుంచి 60 ఏళ్ల మహిళలు అర్హులు
- వైఎస్సార్‌సీపీ పాలనలో నాలుగు విడతల్లో రూ.60 వేల లబ్ధి
- కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు కాపు నేస్తం
- వైశ్య, కమ్మ, రెడ్డి, క్షత్రియ కులాల పేదలకు ఈబీసీ నేస్తం
- కాపు, అగ్రవర్ణ పేదలనూ దగా చేసిన టీడీపీ సర్కారు

సాక్షి, విశాఖపట్నం, రాంబిల్లి, రావికమతం: ఎన్నికల మేనిఫెస్టోలో లేకున్నా.. ఎలాంటి హామీ ఇవ్వకపోయి నప్పటికీ కాపు సామాజిక వర్గానికి, అగ్రవర్ణ కులస్తులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. ఆయా సామాజిక వర్గాలకు చెందిన గ్రామీణ, పట్టణ మహిళల వికాసానికి తోడ్పాటు నందించింది. కాపు కార్పొరేషన్ ద్వారా ‘వైఎస్సార్ కాపు నేస్తం’ కింద 45 నుంచి 60 ఏళ్లలోపు కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల మహిళలకు ఏటా రూ.15 వేల చొప్పున ఐదేళ్లలో మొత్తం రూ.75 వేల సాయాన్ని అందిస్తోంది. ఇప్పటివరకూ నాలుగు విడతల్లో రూ.60 వేల లబ్ధి చేకూర్చింది. ఇదే మొత్తాన్ని ‘ఈబీసీ నేస్తం’ పేరిట బ్రాహ్మణ, వైశ్య, కమ్మ, రెడ్డి కులాల్లో పేదలకు అందించింది.

కాపు, అగ్రవర్ణ పేదలపై టీడీపీ శీతకన్ను..

గత టీడీపీ సర్కారు కాపు సామాజిక వర్గం, అగ్రవర్ణ పేదలపై శీతకన్ను వేసింది. కాపు రిజర్వేషన్ల విషయంలోనూ దగా చేసింది. సంవత్సరానికి రూ.వెయ్యి కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.ఐదు వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకుండా వంచించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కాపు కార్పొరేషన్ ద్వారా ఏడాదికి రూ.2 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొనగా, అంతకంటే మిన్నగా మేలు చేయడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో విశాఖ జిల్లాలో కాపు నేస్తం కింద 59,778 మందికి గానూ రూ. 89.66 కోట్లు, ఈబీసీ పథకం కింద 22,731 మంది లబ్ధిదారులకు రూ.34.09 కోట్లు, అనకాపల్లి జిల్లాలో 67,131 మందికిగానూ రూ.100.69 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 11,605 మందికి రూ.17.40 కోట్లు, అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లో కాపు నేస్తం కింద 3,453 మందికి రూ.5.17 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 1,232 మంది లబ్ధిదారులకు రూ.18.4 లక్షలు సాయమందించింది. కాపు నేస్తం కింద కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల లబ్ధిదారులకు డీబీటీ ద్వారా అందించింది.

అనకాపల్లి జిల్లా వివరాలిలా..

కాపు నేస్తం	విడతల వారీగా లబ్ధిదారులు	ఆర్థిక సాయం (రూ. లక్షల్లో)
ఫేజ్-1	17,274	2,591.1
ఫేజ్-2	14,973	2,245.95
ఫేజ్-3	16,762	2,514.2
ఫేజ్-4	18,122	2,718.3
మొత్తం	67,131	10,069.5

ఈబీసీ నేస్తం - 11,605 మంది లబ్ధిదారులు
ఆర్థిక సాయం రూ.1,740.75 లక్షలు

అవసరానికి ఆదుకున్న కాపు నేస్తం



నా పేరు పులఖండం లక్ష్మి. మాది రావికమతం మండలం పి.పొన్నవోలు గ్రామం. వైఎస్సార్ కాపు నేస్తం డబ్బులు నాకు ఏటా అందుతున్నాయి. ముఖ్యమంత్రిగా జగన్‌బాబు అందరికీ అన్నీ ఇస్తున్నాడు. కాపులకు కూడా ఆర్థిక సాయం ఇస్తారనడంతో మా అబ్బాయి నాకు చెప్పాడు. నిజంగా ఇస్తారా? అనే అనుమానంతో దరఖాస్తు పెట్టుకున్నాం. నాతోపాటు మా ఊర్లో మళ్ల సత్యవతి, ఆదిదేముడమ్మ, పులఖండం వరహాలు, సరస్వతి, చినతల్లి, మళ్ల వరలక్ష్మి తదితర 17 మందిమి దరఖాస్తు చేశాం. మా అందరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాలో వేస్తున్నారు. దీంతో జగన్‌బాబు చెప్పాడంటే చేస్తాడని నమ్మకం కుదిరింది. తొలిసారిచ్చిన డబ్బులతోనే నా మనవడికి పేరు పెట్టినపుడు బంగారం గొలుసు కొనిచ్చి, మురిసిపోయాను. నాకు ప్రతి నెలా ఒకటో తేదీనే వృద్ధాప్య పింఛన్ ఇంటికే వచ్చి వలంటీర్ ఇస్తున్నారు. రూ.20 వేలు డ్వాక్రా రుణ మాఫీ అయ్యింది. రైతు భరోసా డబ్బులూ పడుతున్నాయి. ఇలా అన్నింటి జగన్‌బాబు మమ్మల్ని బాగానే ఆదుకున్నాడు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇలా చేసింది లేదు. వ్యవసాయానికి ఎక్కడెక్కడో అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడేవాళ్లం. ఇపుడా పరిస్థితి లేదు. చాలా సంతోషంగా ఉన్నాం. జగన్‌బాబుకు ఎంతగానో రుణపడిపోయాం.

సీఎం జగన్‌తోనే మా బతుకులకు భరోసా



నా పేరు ఎన్.సత్యవతి. రాంబిల్లి మండలం దిమిలి గ్రామం మాది. నా భర్త చనిపోయాడు. ముగ్గురు పిల్లలు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లిళ్లు అయిపోయాయి. మా అబ్బాయి ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. మా వలంటీర్ రాము చెప్పే వరకు కాపు నేస్తం పథకం గురించి నాకేం తెలీదు. వలంటీరే కాపు నేస్తం పథకానికి దరఖాస్తు చేయించారు. ప్రభుత్వం అడిగిన అర్హతలన్నీ ఉండడంతో పథకం మంజూరైంది. ఏడాదికి రూ.15 వేలు చొప్పున మూడుసార్లు మొత్తం రూ.45 వేలు నా బ్యాంకు ఖాతాలో పడ్డాయి. నాకు వితంతు పెన్షన్ కూడా వస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచనుగా పింఛన్ డబ్బులు రూ.3 వేలు ఇంటికే వచ్చి ఇస్తున్నారు. దీనికి తోడు కాపు నేస్తం సాయం అందింది. ఈ సొమ్మును సద్వినియోగం చేసుకునేందుకు చిన్న కిరాణా దుకాణాన్ని పెట్టుకున్నాను. జగన్‌బాబు దయ వల్ల ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పనిలేదు. నా కాళ్లపై నేను నిలబడుతూనే, నా కుటుంబానికి నా వంతు ఆసరాగా నిలుస్తున్నాను. నా పెన్షన్, కాపు నేస్తం సాయంతో కిరాణా దుకాణాన్ని విజయవంతంగా నడుపుతూ రోజూ కొంత ఆదాయం పొందుతున్నారు. గతంలో ప్రభుత్వాలు కాపు మహిళలకు ప్రత్యేకంగా ఏ పథకమూ అందించిన దాఖలాలేదు. సీఎం జగన్ సాయం మరువలేనిది.

అన్నదాతల్లో ఆనందం



ధాన్యం గాలిపోత పోస్తున్న రైతులు



ధాన్యం తూకం వేస్తున్న వ్యాపారులు

- పెరిగిన ధాన్యం ధర
- గత ఏడాదితో పోలిస్తే బస్తాకు రూ.350 అదనం
- పెరిగిన దిగుబడులు

రాంబిల్లి: ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుంది. ధాన్యం ధర ఈ ఏడాది పెరిగింది. దిగుబడులు సైతం పెరగడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది 75కేజీల ధాన్యం బస్తా ఈ ఏడాది రూ 1750 అమ్ముతుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది బస్తాకు రూ 350 అదనంగా వస్తుంది. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎకరాకు దిగుబడి 25 నుంచి 28 బస్తాలు రాగా ఈ ఏడాది 30 నుంచి 33 బస్తాలు దిగుబడి వస్తుంది.

జిల్లాలో 44వేల హెక్టార్లలో...

అనకాపల్లి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 44,736 హెక్టార్లలో వరి సాగు చేశారు. హెక్టారుకు 4,598 కేజీల చొప్పున దిగుబడి వచ్చి మొత్తం 2,05,695 మెట్రిక్ టన్నులు జిల్లా వ్యాప్తంగా ధాన్యం ఉత్పత్తి జరిగింది. జిల్లాలో అత్యధికంగా నాతవరం మండలంలో 6195 హెక్టార్లులో వరి పంటను సాగు చేసి 33,765 మెట్రిక్ టన్నులు దిగుబడిని రైతులు సాధించారు. మాడుగుల మండలంలో 3805 హెక్టార్లులో17259 మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చి రెండో స్థానంలో నిలిచింది.

ఆశాజనకంగా దిగుబడులు

రాంబిల్లి మండలంలో ఖరీఫ్‌లో 6300 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. డిసెంబరులో సంబవించిన మిచాంగ్ తుపాను ప్రభావంతో 2100 ఎకరాల్లో వరిపంట దెబ్బతినడంతో బాధిత రైతులకు ఎకరాకు రూ 6800 చొప్పున పరిహారం ప్రభుత్వం మంజూరు చేసింది. మిగిలిన పొలాల్లో మంచి దిగుబడులు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాంబిల్లి మండలంలో ఆర్‌జీఎల్ రకాన్ని 90 శాతం మంది రైతులు సాగు చేశారు. ఖరీఫ్ వరి కోతలు అనంతరం పెసర, మినుము పంటలను రైతులు సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో పెసర, మినుము పంటలు సైతం మంచి దిగుబడులు వచ్చాయి. 100కేజీలు పెసలు రూ 7600, మినుములు రూ 7400 కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. తక్కువ సాగు ఖర్చులయ్యే పెసర, మినుము పంటలు బాగా పండటంతో రైతులు మరింత జోష్‌గా ఉన్నారు. ఈ ఏడాది ధాన్యం, పెసర, మినుము పంటలు దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని, ధరలు గత ఏడాదితో పోలిస్తే పెరిగాయని రాంబిల్లి మండల ఏవో సి.సమంత తెలిపారు.

రైతుకు ఆర్థికంగా మేలు



ఈ ఏడాది వరి, పెసర, మినుము పంటలు బాగా పండాయి. అంతేగాక ఈ ఏడాది ధాన్యం ధర బాగుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రస్తుతం రూ 350 అదనంగా ధర పలుకుతుంది. ప్రస్తుతం 75 కేజీల బస్తా రూ 1750 పలుకుతుంది. ఇది రూ 2వేల వరకు పెరిగే అవకాశాలున్నాయి. ధర పెరగడం, దిగుబడులు బాగుండడం రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు చేస్తున్నాయి.

–సీహెచ్ వెంకటరమణ, రైతు, కట్టుబోలు

ఆర్‌బీకేల ద్వారా సకాలంలో సేవలు



రబీ సీజన్‌కు సంబంధించి 2301 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా ఏ ఏడాది 1450 హెక్టార్లులో వరి సాగు చేశారు. ఈ ఏడాది రబీ, ఖరీఫ్ దిగుబడులు బాగున్నాయి. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయడంతో పాటు రైతులకు అవసరమైన సలహాలు , సూచనలను సకాలంతో అందజేశాం.

– మోహనరావు, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు

రైలు నుంచి జారి పడి చికిత్స పొందుతూ యువకుడి మృతి



అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో రైలు నుంచి జారి పడిన యువకుడు(25) చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ శాంతారామ్ కథనం మేరకు వివరాలు...స్థానిక శారదానది బ్రిడ్జి సమీపంలో సోమవారం రాత్రి సమయంలో విశాఖ నుంచి విజయవాడ వెళ్లే రైల్వే ట్రాక్ సమీపంలో గుర్తు తెలియని రైలు నుంచి గుర్తు తెలియని 25 సంవత్సరాల యువకుడు జారి పడిపోవడంతో అటుగా వెళ్లే రైల్వే గ్యాంగ్‌మ్యాన్ స్టేషన్ మేనేజర్‌కు సమాచారం ఇచ్చి 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించడం జరిగిందని ఎస్ఐ చెప్పారు. తలకు తీవ్ర గాయమవడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని వైద్యాలయంలో మార్చురీలో భద్రపర్చడం జరిగిందని ఎస్ఐ చెప్పారు. మరిన్ని వివరాలకు 9491782534 నంబరును సంప్రదించాలని కోరారు.

4 కిలోల గంజాయితో యువకుడి అరెస్టు



గంజాయితో పట్టుబడ్డ నిందితుడు కార్తీక్

కె.కోటపాడు : ఎ.కోడూరు నుంచి కె.కోటపాడు వచ్చే మార్గంలో గంజాయిని తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌కు చెందిన యువకుడు కె.కార్తీక్‌ను కె.కోటపాడు పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. రోడ్డు మార్గంలో బ్యాగ్‌తో అనుమానస్పదంగా సంచరిస్తున్న కార్తీక్‌ను పట్టుకొని అతని వద్ద గల బ్యాగ్‌ను తనిఖీ చేయగా 4 కిలోల గంజాయిని గుర్తించినట్టు కె.కోటపాడు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. గంజాయితో పట్టుకున్న యువకుడు కార్తీక్‌ను ప్రశ్నించగా పాడేరు ప్రాంతం నుంచి తీసుకువస్తున్న గంజాయిని కె.కోటపాడు మీదుగా పెందుర్తికి తీసుకువెళ్లేందుకు ఇటువైపు వెళ్తున్నట్టు తెలిపినట్టు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. గంజాయితో పట్టుబడ్డ కార్తీక్‌పై కేసును నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

20 లీటర్ల సారాతో ఒకరి అరెస్ట్

- 300 లీటర్ల పులుపు ధ్వంసం



పట్టుబడ్డ సారాతో నిందితుడు, రావికమతం ఎస్ఐ ధనంజయ్

రావికమతం : ఇరవై లీటర్ల నాటు సారాతో పిల్లవానిపాలెం గ్రామానికి చెందిన ఎం.రాము అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు రావికమతం ఎస్ఐ ధనంజయ్ మంగళవారం తెలిపారు. పిల్లవానిపాలెం గ్రామంలో పెద్ద ఎత్తున సారా తయారీ చేస్తున్నట్టు తమకు ముందస్తు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో సహా మంగళవారం దాడులు చేశామన్నారు. గ్రామం శివారు పొలాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల పులుపును, తయారీ పరికరాలను ధ్వంసం చేశామన్నారు. ఆ గ్రామానికి చెందిన రాము 20 లీటర్ల సారాని అమ్మకానికి తరలిస్తుండగా పట్టుకుని అరెస్ట్ చేశామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



మృతి చెందిన మహాలక్ష్మమ్మ

కశింకోట : జి.భీమవరం వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ ఎం.వినోద్‌బాబు మంగళవారం అందించిన వివరాల ప్రకారం..అనకాపల్లి నుంచి నర్సీపట్నం వైపు వెళుతున్న టిప్పర్ లారీ స్కూటీని ఢీకొంది. దీంతో స్కూటీపై వెళుతున్న రావికమతం మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన సంకు మహాలక్ష్మమ్మ(65), అల్లుడు శృంగవరపు రాము రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వీరిని నర్సీపట్నం ఆస్పత్రికి తరలిస్తుండగా సమీపంలో సోమవారం రాత్రి మహాలక్ష్మమ్మ మృతి చెందింది. రాము ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాంబిల్లి మండలం వెంకటాపురం గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి తమ గ్రామానికి తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

విష్ణుకుమార్‌రాజు కోడ్ ఉల్లంఘన!

మద్దిపాలెం: జీవీఎంసీ 49వ వార్డు పట్టాభిరెడ్డితోట ప్రాంతంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు మంగళవారం ఆయా పార్టీల కండువాలను ధరించి పూజలు నిర్వహించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఆలయాల్లో రాజకీయాలు ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పార్టీ కండువా వేసుకోవడంతో పాటు ఆలయాల్లో తీయించుకున్న ఫొటోలకు పార్టీ గుర్తును జతచేసి.. పలు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తున్నారని ఆరోపించారు. ఇది కోడ్ ఉల్లంఘనేనని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఊరూవాడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచార హోరు



విజయీభవ : అనకాపల్లి నియోజకవర్గం కశింకోటలో బ్రహ్మకుమారి ధనలక్ష్మి నుంచి ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



అక్కచెల్లెమ్మల ఆదరణ మాకే : పాయకరావుపేట నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సాక్షి నెట్‌వర్క్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారం జోరందుకుంది. వీరితోపాటు పార్టీ స్థానిక నాయకులు కూడా తమ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, అత్యధిక మెజార్టీతో పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. కరోనా సమయంలోను, ఆ తర్వాత ప్రజల్ని అన్ని విధాలా ఆదుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలంటూ ప్రజల్ని కోరుతున్నారు.

- అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అనకాపల్లి మండలంలోని తమ్మయ్యపేట, సంపతిపురం, మార్టూరు గ్రామాల్లో గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కశింకోటలోని బ్రహ్మకుమారీల ఆశ్రమాన్ని సందర్శించారు. వారి ఆశీస్సులు పొందారు. మహిళలు హారతులు పట్టి ఆశీర్వదించారు.
- పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పాయకరావుపేట మండలంలోని జేవీపాలెంలో మంగళవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. జేవీపాలెం శివారు జంగలూరు, వెలంపాలెం, సైతారుపేట శివారు వినాయకనగర్, వేమగిరి, సైతారుపేట, పేట సూదిపురం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు.
- చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఎన్నికల ప్రచారానికి జన నీరాజనం పలికారు. అభిమానుల కోలాహలం మధ్య చోడవరం పట్టణంలో పెదబజార్, అన్నవరం ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. తమ ఇంటికి వచ్చిన ధర్మశ్రీకి మహిళలు హారతులతో నీరాజనం పలికారు.
- ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గొలుగొండ మండలం సీహెచ్ నాగాపురంలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున హారతులతో ఘన స్వాగతం పలికారు. పంచాయతీలో టీడీపీ నుంచే కాకుండా స్వచ్ఛందంగా 11 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు.



సలభీములనైనా ఓడిస్తా : చోడవరం పట్టణం పెదబజార్‌లో నూడుల్స్ చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



మా మద్దతు మీకే : నర్సీపట్నంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్న మహిళలు

రూ.3.30 లక్షల నగదు స్వాధీనం, కేసు నమోదు

అనకాపల్లి: మండలంలోని సీహెచ్ఎన్ అగ్రహారంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.3.30 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో సబ్బవరం నుంచి అనకాపల్లి వైపు బుల్లెట్‌పై వస్తున్న శ్రీనివాసరావు వద్ద ఈ నగదు లభించిందన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు నగదు తీసుకువెళ్లే సమయంలో అందుకు సంబంధించిన ఆధారాలు తమ వెంట ఉండాలన్నారు. లేకుంటే నగదు స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేస్తామన్నారు. తన వద్దనున్న నగదుకు సంబంధించి శ్రీనివాసరావు ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపడిన ప్లంబర్ మృతి

యలమంచిలి రూరల్ : రైల్వేస్టేషన్ సమీపంలో ఓ పాఠశాలలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ ఓ భవనం పై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన ప్లంబర్ శీరందాసు ప్రేమ్‌కుమార్(25) మంగళవారం మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ పాపినాయుడు మీడియాకు తెలిపారు .పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ ఈనెల 13వ తేదీన ఓ భవనం వద్ద అంతర్గత నీటి సరఫరా పైపులైన్ పనిచేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. యలమంచిలి ప్రభుత్వాస్పతిలో ప్రథమ చికిత్స అనంతరం గాయపడిన ప్రేమ్‌కుమార్‌కు విశాఖ కేజీహెచ్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. నాడీవ్యవస్థ దెబ్బతినడంతో ప్రేమ్‌కుమార్ పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయినట్టు ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు నుంచి జారిపడి విద్యార్థికి గాయాలు



గాయపడిన విద్యార్థి చంద్రమౌళి

యలమంచిలి రూరల్: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో రైలు నుంచి జారిపడి డిప్లొమా విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలివి. రామచంద్రపురానికి చెందిన ఎం.చంద్రమౌళి అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదువుతున్నాడు. మంగళవారం రామచంద్రపురం నుంచి అచ్యుతాపురం వెళ్లేందుకు యలమంచిలి రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతుండగా జారిపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని వెంటనే యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో చేర్చి ప్రథమ చికిత్స అదించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదంపై తుని రైల్వే పోలీసులకు స్థానిక రైల్వే సిబ్బంది సమాచారం అందించారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి

- 1500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



గుర్రాలపాలెంలో రైతు పొలాల సమీపంలో గుర్తించిన బెల్లం పులుపును ధ్వంసం చేస్తున్న ఎస్ఐ ఎల్.సురేష్, సిబ్బంది

రోలుగుంట : మండలంలోని పలు గ్రామాల్లో నాటుసారా తయారీ బట్టీలపై స్థానిక ఎస్ఐ ఎల్.సురేష్ మంగళవారం దాడులు చేశారు. గుండుబాడు పంచాయితీ శివారు గుర్రాలపాలెం పొలాల సమీపంలో సారా బట్టీలు, సమీప పొలాలు, సరుగుడు తోటల్లోను దాడులు చేశారు. సారా తయారీలో వినియోగించేందుకు ప్లాస్టిక్ టిన్నుల్లో నిల్వ ఉంచిన 1500 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ఈ విధంగా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కేసులు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ సమీప గ్రామాల ప్రజలను హెచ్చరించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..



రామారాయుడుపాలెం నుంచి పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గణేష్

- 20 కుటుంబాల చేరిక

మాకవరపాలెం : వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. మండలంలోని బూరుగుపాలెం శివారు రామారాయుడుపాలెం గ్రామంలోని టీడీపీకి చెందిన 20 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీపీ రుత్తల సత్యనారాయణతో కలసి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే గణేష్ వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, మండల యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, నాయకులు భీమిరెడ్డి గోవిందారావు, రుత్తల నాయుడు పాల్గొన్నారు.

చోడవరం జనసేనలో వర్గ విభేదాలు

- నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తీరుపై 'బుచ్చెయ్యపేట' నాయకుల ధ్వజం



వడ్డాదిలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు నవీన్

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలంలో జనసేన పార్టీలో వర్గ విబేధాలు బైట పడ్డాయి. చోడవరం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్ రాజు అవలంభిస్తున్న తీరుపై జనసేన మండల కార్యదర్శి సయ్యపురెడ్డి నవీన్, మండల కార్యదర్శి మండపాటి బాబూరావు తదితరులు తీవ్ర ఆగ్రహం చెందారు. మంగళవారం సాయింత్రం మేజర్ పంచాయితీ వడ్డాది జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వీరు మాట్లాడుతూ జనసేన పార్టీ పుట్టిన నుంచి పార్టీలో ఉంటూ లక్షలాది రూపాయలు పార్టీ కోసం ఖర్చు చేస్తున్న మమ్మల్ని కాదని తన సొంత పార్టీలా పి.వి.ఎస్.ఎన్ రాజు వ్యవహరిస్తున్నారన్నారు. పార్టీ కార్యక్రమాలకు సంబంధించి తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అవమానించడం, మా గ్రామంలో కార్యక్రమాలకు మాకు తెలియకుండా, సమాచారం లేకుండా నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. గత సర్పంచ్ ఎన్నికల్లో వడ్డాదిలో 11 వార్డుల్లో జనసేన పార్టీ అభ్యర్థులను నిలబెట్టి లక్షల రూపాయిలు ఖర్చు చేసిన మమ్మల్ని కనీసం పట్టించుకోవడం లేదని నవీన్ ఆవేదన వ్యక్తం చేశారు. చోడవరంలో పార్టీకి మేం కష్ట పడుతున్నా నియోజకవర్గ ఇన్‌చార్జి మాత్రం వేరే ధోరణిలో ఉన్నారని, తక్షణం చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా పి.వి.ఎస్.ఎన్ రాజును తొలగించాలని పలువురు మండల జనసేన కార్యకర్తలు, నాయకులతో సంతకాలు చేసి అధిష్టానికి లేఖ రాశామన్నారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు నాలం వరహాలు, బొబ్బాది మానీలు, సయ్యపురెడి జనార్దన్, అరిశంకల వాసు పాల్గొన్నారు.

రూ.3,92,500 నగదు పట్టివేత

కూర్మన్నపాలెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అగనంపూడి టోల్‌గేటు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో తుని నుంచి విశాఖ వస్తున్న కారులో కోరుకొండ ఈశ్వర్ గణేష్, సూరంపూడి చంద్రశేఖర్ వద్ద రూ.3,92,500 నగదు లభ్యమైంది. ఈ నగదుకు సంబంధించి వారి వద్ద పత్రాలు ఉన్నప్పటికీ.. వారు సరైన సమాధానం చెప్పలేకపోయారు. థాయిలాండ్ వెళ్లేందుకు భారతీయ కరెన్సీని థాయ్ బాట్‌గా ఎక్స్ఛేంజ్ చేసేందుకు విశాఖ వెళ్తున్నట్లు వారు చెప్పారు. ఇందుకు సంబంధించిన పత్రాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు. నగదును స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

జపాన్ ప్లాజాలో నిషేధిత ఈ-సిగరెట్లు

- పోలీసుల తనిఖీల్లో 21 ప్యాకెట్ల లభ్యం
- షాపు నిర్వాహకుడు అబ్దుల్ ఖాదర్ అరెస్ట్
- గతంలో కూడా విజిలెన్స్ దాడుల్లో దొరికిన నిందితుడు
- మళ్లీ అదే తరహాలో విక్రయాలు

విశాఖ సిటీ: నగరంలో నిషేధిత ఈ-సిగరెట్ల అక్రమ వ్యాపారం దుమారం రేపుతోంది. గత వారమే రెండు షాపులపై పోలీసులు చేసిన దాడుల్లో భారీగా ఈ-సిగరెట్లు లభ్యమవగా.. తాజాగా డాబాగార్డెన్స్ ప్రాంతంలో జపాన్ ప్లాజాలో ఈ-సిగరెట్లను పోలీసులు గుర్తించారు. సుమారు రూ.3.76 లక్షలు విలువ చేసే 21 ఈ-సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు నిర్వాహకుడ్ని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. జపాన్ ప్లాజాలో అక్రమంగా విదేశీ సిగరెట్లు ఉన్నాయని పోలీసులకు సమాచారం అందింది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు రెండోపట్టణ ఎస్ఐ కె.శంకర్‌రావు తన సిబ్బందితో కలిసి మంగళవారం షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. లోపల 21 నిషేధిత ఈ-సిగరెట్, అక్రమ విదేశీ సిగరెట్ ప్యాకెట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.3.76 లక్షల వరకు ఉంటుంది.

చెన్నై, ముంబైల నుంచి..

చెంగళరావుపేట ప్రాంతానికి చెందిన అబ్దుల్ ఖాదర్ (53) 35 ఏళ్ల నుంచి డాబాగార్డెన్స్ ప్రాంతంలో జపాన్ ప్లాజా షాపును నిర్వహిస్తున్నాడు. బ్యాగులు, పెర్ఫ్యూమ్‌లు, ఇతర సామగ్రిని విక్రయిస్తుంటాడు. అధికంగా డబ్బు సంపాదించాలన్న ఆశతో చెన్నై, ముంబైల నుంచి నిషేధిత ఈ-సిగరెట్లను తీసుకువచ్చి షాపులో విక్రయిస్తున్నాడు. దీంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

గతంలో పట్టుబడిన నిందితుడు

జపాన్ ప్లాజా నిర్వాహకుడు గతంలో అక్రమంగా విదేశీ సిగరెట్లు విక్రయిస్తుండగా పోలీసు, విజిలెన్స్ అధికారుల దాడుల్లో రెండుసార్లు పట్టుబడ్డాడు. గత ఏడాదిలో కూడా విజిలెన్స్ అధికారులు జపాన్ ప్లాజాపై చేసిన దాడుల్లో భారీగా విదేశీ సిగరెట్లు గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేశారు. అయినప్పటికీ మార్పు లేకుండా తాజాగా మరోసారి ఈ-సిగరెట్ల విక్రయాలతో దొరికాడు.

క్లుప్తంగా

నేడు మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ

అనకాపల్లి: మండలంలోని దిబ్బపాలెం గ్రామం శ్రీ మరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ పీలా ఉషాఅప్పారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజల్లో భాగంగా రత్న, బీజన్యాసములు, శిఖర, యంత్రప్రతిష్ఠ, నేత్రోత్సవం, కూష్మాండబలి, ధేను, దర్పణ దర్శనం అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కలిస్తామన్నారు. పట్టణంలోని జగన్నాథస్వామి దేవాలయం అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ విశేష పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా పోలిపల్లెమ్మ పండగ



పోలిపల్లెమ్మ అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజ

తుమ్మపాల: మండలంలోని రేబాక గ్రామంలో పోలిపల్లెమ్మ పండగ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుని, పూజలు జరిపారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ పుర వీధుల మీదుగా భక్తులు ఘటాలతో తరలివచ్చి అగ్నిగుండాలు తొక్కారు. మధ్యాహ్నం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మహిళలు చిడత భజనలు చేశారు. సాయంత్రం తీన్‌మార్ డప్పులు, నాట్యాలతో అమ్మవారిని ఊరేగింపు చేసి తీర్థప్రసాదాలను నివేదించారు. విద్యుత్ అలంకరణతోపాటు భక్తుల రద్దీతో అమ్మవారి ఆలయం వద్ద సందడి నెలకొంది. సాయంత్రం డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఆహూతుల్ని అలరించింది.

వీధి కుక్కల బెడద నివారించండి

అనకాపల్లి: పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వీధి కుక్కల బారిన పడి వృద్ధులు, చిన్నపిల్లలు గాయపడుతున్నారని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. మంగళవారం గవరపాలెం పరిసర ప్రాంతాల్లో నలుగురు చిన్నారులు కుక్కకాటుకు గురై ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. రాత్రుళ్లు వీటి సమస్య మరింత ఎక్కువగా ఉందన్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని ప్రజలకు వీధికుక్కల బెడద తప్పించాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 5,217 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,860	4,510
మొదటి రకం	3,560	4,110
రెండో రకం	3,420	3,810
మూడోరకం	3,280	3,560

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
గామి	: సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	: సత్యనారాయణస్క్రీన్-2
అనన్య	: షిర్డిసాయి
ఓం భీం బుష్	: పర్తిసాయి
యమధీర	: వెంకటేశ్వర
రికార్డ్ బ్రేక్	: శ్రీసత్య
భీమా	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 353 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

రైతుకు నేస్తం.. రైతు భరోసా కేంద్రం

వ్యవసాయం దండగమారి వ్యవహారం కాదు.. అదో పండగ. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రైతులకు ఆ విషయం తెలిసింది. ఎరువుల కోసం మండల/జిల్లా కేంద్రాల్లో పడిగాపుల్లేవు. నకిలీ విత్తనాలతో మోసపోవాల్సిన అగత్యం లేదు. పంట నష్ట పరిహారానికి అధికారుల్ని ప్రసన్నం చేసుకోవాల్సిన పనేలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల ఏర్పాటుతో రైతుల కష్టాలన్నీ మటుమాయమయ్యాయి.



రైతు భరోసా కేంద్రం



ఆవుకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

- వ్యవసాయ సేవలకు చిరునామాగా ఆర్బీకేలు
- అందుబాటులో వెటర్నరీ సేవలు
- రైతుల సేవలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు
- ఆర్బీకేలోనే రాయితీ విత్తనాలు, ఎరువులు, ఈ క్రాప్ సేవలు
- మండలంలో రూ.6.25 కోట్లతో భవనాలు

తుమ్మపాల: ప్రతి పల్లెలో వ్యవసాయాన్ని మరింత వృద్ధి చేయాలి. రైతులు వారి భూముల్ని పూర్తి స్థాయిలో సాగులోకి తెచ్చి ఆర్థిక స్థిరత్వం పొందాలి. అదే లక్ష్యంతో సీఎం జగన్ గ్రామగ్రామానా ఆర్బీకేలను ఏర్పాటు చేశారు. ఆర్బీకేల ద్వారా ప్రతి రైతు సాగుకు అవసరమైన వాటన్నింటినీ ఉన్న ఊర్లోనే అందిస్తున్నారు. ప్రభుత్వంతో సంబంధముండే ప్రతి పనీ తను ఖాళీగా ఉన్న సమయంలోనే చేసుకునే వెసులుబాటు కలగడంతో రైతులు ఆనందంగా ఉన్నారు.

విత్తు నుంచి విక్రయం వరకు

ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నుంచి పంట అమ్మకం వరకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు అగ్రికల్చర్ అసిస్టెంట్లను ప్రభుత్వం నియమించింది. వీరు ప్రతి రోజూ రైతులకు అందుబాటులో ఉంటారు. పంటరుణాలు, బీమా సౌకర్యం, గిట్టుబాటు ధరలు తదితర అన్ని అంశాలూ వీరు చూసుకుంటున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన వివిధ మ్యాగజైన్లు, పుస్తకాలను కూడా ఆర్బీకేల్లోని లైబ్రరీలో అందుబాటులో ఉంచారు.

రైతు శిక్షణ తరగతులు, విజ్ఞాన కేంద్రాలుగా కూడా ఆర్బీకేలు పనిచేస్తున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు ప్రభుత్వ గ్యారెంటీ ఉండటంతో నకిలీలతో మోసపోయే ప్రమాదం తప్పింది. ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ద్వారా రైతులకు సూచనలు, సలహాలు కూడా అందిస్తున్నారు.

వెటర్నరీ సేవలు అనుసంధానం

మండలంలోని తగరంపూడి, వెంకుపాలెం, కుంచంగి, కూండ్రం, కొత్తూరు. గొలగాం, గోపాలపురం, కోడూరు. మార్టూరు, బవులువాడ, ఊడేరు, రేబాక, సంపతిపురం గ్రామాల్లో ఇప్పటికే సొంత భవనాల ద్వారా ఆర్బీకే సేవలు రైతులకు అందుతున్నాయి. ఒక్కో భవనానికి రూ.25 లక్షల వరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మిగిలిన గ్రామాల్లో కూడా పనులు చివరి దశకు వచ్చాయి. సొంత భవనాల్లేని గ్రామాల్లో తాత్కాలిక భవనాల్లోనే సేవలు అందిస్తున్నారు.

వ్యవసాయ సేవలతో పాటు పాడి రైతులకు కూడా ఆర్బీకేలు సేవలందిస్తున్నాయి. ఇందుకోసం వెటర్నరీ అసిస్టెంట్లను ఆర్బీకేలకు అనుసంధానం చేశారు. దీంతో వ్యవసాయ, పాడి పరిశ్రమకు అవసరమైన సేవలన్నింటినీ ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం అందిస్తోంది.

సేవలన్నీ ఒక్క చోటే..



గ్రామంలో నాకున్న పొలంలో వరితోపాటు అన్ని రకాల కూరగాయలు పండిస్తాను. గతంలో పంటలకు తెగుళ్లు వస్తే ప్రైవేట్ షాపులకు వెళ్లి, వారు ఏ పురుగు మందులిస్తే వాటినే వేసేవాళ్లం. కొన్నిసార్లు పంట పూర్తిగా నాశనమయ్యేది. ఇపుడా పరిస్థితి లేదు. మా గ్రామంలో వ్యవసాయ పరంగా అన్ని సేవలూ ఆర్బీకే ద్వారానే అందుతున్నాయి. విత్తనాలు, ఎరువులు కూడా ఇక్కడే అందిస్తున్నారు. ఈ క్రాప్ నమోదు ఈజీ అయింది.

– మంత్రి నాని, రేబాక

సకాలంలో పంటనష్టం నమోదు



గత ఏడాది రెండెకరాల్లో వరి సాగుచేశాను. తుపాను కారణంగా పంట నీట మునిగి నష్టపోయాను. ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించినప్పటికీ ఎలా నమోదు చేసుకోవాలో తెలియక భయపడ్డాను. కానీ రెండు రోజుల్లోనే రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఫోన్ చేశారు. నా పంట నష్టాన్ని దగ్గరుండి మరీ పరిశీలించి, ట్యాబ్‌లో నమోదు చేశారు. దాంతో నాకు పంటనష్ట పరిహారం మంజూరైంది. ఈ ప్రభుత్వంలో చాలా సంతోషంగా ఉన్నాం.

– దాసరి గోపాలరావు, గొలగాం

ఎంపీగా బూడి ప్రకటనపై హర్షం



ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడుని ప్రకటించడంతో నెహ్రూచౌక్‌లో మిఠాయిలు తినిపించుకుంటున్న పార్టీ శ్రేణులు

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ప్రకటించిన బూడి ముత్యాలనాయుడుని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత తమ అందరిపైనా ఉందని పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో ఎంపీ అభ్యర్థిగా ముత్యాలనాయుడుని ప్రకటించడంతో పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంచిపెట్టి, బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాడుగుల నియోజకవర్గం నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ డిప్యూటీ సీఎం స్థాయి పదవులు నిర్వహించిన బూడి ముత్యాలనాయుడు అనకాపల్లి ఎంపీగా బరిలో దిగడం అభిమానులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిందన్నారు. రానున్న ఎన్నికల్లో అనకాపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, నూకాంబిక ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక జాతరకు సన్నాహాలు

- వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఆర్డీవో సమీక్ష
- ఎన్నికల నిబంధనలను పాటిస్తూ జాతర ఏర్పాట్లు



నూకాంబిక జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గవరపాలెం నూకాంబిక అమ్మవారి జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ సూచించారు. స్థానిక దేవాలయం ఆవరణలో మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో దేవాలయం ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానానికి అనుసంధానంగా ఉన్న రోడ్లను రోజూ ఉదయం, సాయంత్రం వ్యర్థాల తొలగింపు చేపట్టి, ట్రాక్టర్‌పై డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. అవసరమైన మేరకు నగరపాలక సంస్థ తరఫున ప్రత్యేకంగా స్వీపర్లను నియమించి, రోడ్లు శుభ్రపరచడంతోపాటు, రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ వేసి రోగాల వ్యాప్తి లేకుండా చూడాలన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పాడైన వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. దేవస్థానానికి వచ్చే మార్గంలో రోడ్డు నాక్రమించి ఏర్పాటైన షాపులను తొలగించాలన్నారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను సూచించారు. ఏప్రిల్ 7న ప్రత్యేక బందోబస్తుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతర నెల రోజులు మెడికల్ క్యాంపు నిర్వహించాలన్నారు. అమ్మవారి జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్, నీటి సరఫరాలో అవాంతరాల్లేకుండా చూడాలని ఆయా విభాగాల అధికారులను సూచించారు. జాతరలో మత్తుపానీయాలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిందిగా ఎస్ఈబీ అధికారులకు కోరారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డీసీ ఎస్.సుజాత, ఏసీ సుధారాణి, డీఎస్పీ అప్పలరాజు, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ రవిచంద్ర, జెడ్పీ ఒమ్మి అయ్యప్పనాయుడు, అగ్నిమాపకశాఖ అధికారి నర్సింగరావు, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు మీరితే చర్యలు తప్పవు

- విలేకరులతో సీఐ వినోద్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వినోద్‌బాబు

కశింకోట: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని కశింకోట సీఐ ఎం.వినోద్‌బాబు కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని జారీ చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రిటర్నింగ్ అధికారి నుంచి పొందవచ్చన్నారు. ఎక్కడైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే అందుకు సంబంధించిన ఫోటో, వివరాలను సీ విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఫిర్యాదు అందిన అర గంటలో విజిలెన్స్ అధికారులు వచ్చి, సంఘటనను పరిశీలించి, గంటలో వివరాలను ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఎన్నికల సమావేశాలు, సభలు నిర్వహించడానికి వాహనాలు, ఇతర చర్యలకు అనుమతి తప్పనిసరన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అనవసర విషయాల్లో చదువుకున్న యువత తలదూర్చి, కేసుల్లో ఇరుక్కుని ఇబ్బందులకు గురికావద్దని హితవు పలికారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సుమారు 10 గ్రామాల్లో అన్ని పార్టీలు, ప్రజలతో కలిపి సమావేశాలు నిర్వహించి, వివరిస్తున్నామన్నారు. ఎన్నికలు సజావుగా జరగడానికి సుమారు 350 మందిని బైండోవర్ చేసినట్లు వెల్లడించారు. ఉద్యోగాల పేరిట యువత మోసపోతున్నారని, మాయమాటలు విశ్వసించకుండా యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, లాటరీలు, నగదు బహుమతులు, తక్కువ ధరకే వాహనాల పేరిట ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్త జాగ్రత్తపడాలన్నారు. ఏటీఎంలో నగదు వేరొకరు కాజేసే పరిస్థితిలో 1930 నెంబర్‌కు కాల్ చేసి వివరాలు చెబితే నగదు పోకుండా నిలిపివేస్తారని తెలిపారు. వేసవి దృష్ట్యా దొంగతనాలు పెరిగే అవకాశం ఉన్నందున, తమ ఇళ్లలో విలువైన బంగారు ఆభరణాలను ఉంచుకోరాదన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేటపుడు తమకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బీవీపీ అధ్యక్షుడిగా వర్మ



విద్యార్థులను సత్కరించిన పరిషత్ నూతన కమిటీ సభ్యులు

అనకాపల్లి: భారత వికాస్ పరిషత్(బీవీపీ) అనకాపల్లి అధ్యక్షుడిగా ఎస్ఏబీ వర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక నర్సింగరావుపేట పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా దాడి శివరాము, కోశాధికారిగా ఏవీ బ్రహ్మానందంలు ఎంపికయ్యారు. తుని పరిషత్ అధ్యక్షుడు ఆంజనేయ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు ఎ.ఓంరామ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. అంతకుముందు జీవీఎంసీ పరిధి, తుమ్మపాల, కొప్పాక, మునగపాక, కశింకోట ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో పరిషత్ సీనియర్ సభ్యులు పి.మహేశ్వరరావు, ఎస్.గోపాలరావు, కె.రమణ అప్పారావు, ఎస్.కోటేశ్వరరావు, వై.కేశవరావు, కేపీఎస్ మూర్తి, వి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పొదుపు ఖాతాలతో అధిక లబ్ధి



అధిక పొదుపు ఖాతాలను చేసిన ఉద్యోగిని సత్కరిస్తున్న శ్రీధర్

అనకాపల్లి: తపాలాశాఖలో పొదుపు ఖాతాల ద్వారా అధిక నగదు ప్రయోజనాలను పొందవచ్చని విశాఖ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్ అన్నారు. స్థానిక గాంధీనగరం కేజేఎస్ ఫంక్షన్ హాల్లో మంగళవారం పొదుపు ఖాతాలపై వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలాశాఖలో పలు మార్పులను తీసుకువచ్చామన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అధిక పొదుపుఖాతాలు చేసిన పీఎల్ఐ అభివృద్ధి అధికారి వై.బి.పలాసరావును సర్టిఫికెట్‌తో సత్కరించారు. కార్యక్రమంలో అనకాపల్లి పోస్టల్ సూపరింటెండెంట్ విల్లూరి సత్యనారాయణ, వివిధ పథకాల సూపరింటెండెంట్లు వెల్లూరు సత్యనారాయణ, సంజయ్ పాండా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యమాంబ పండగకు విస్తృత ఏర్పాట్లు



అంతకాపల్లిలో కొలువైన ముత్యమాంబ మూలవిరాట్

సబ్బవరం: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, భక్తు లకోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకున్న అంతకా పల్లి, బంగారమ్మపాలెం గ్రామాల్లో కొలువైన ముత్యమాంబ పండగను వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. అమ్మవారి తొలేళ్ల సంబరాల్లో భాగంగా బుధవారం రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి ఘటాలు, గరగల ఊరేగింపు నిర్వహించనున్నారు. 28న అనుపు మహోత్సవంలో భాగంగా పలు వైదిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆ రోజు వేకువ జామున 3 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యే పూజలు ప్రారంభమవుతాయి.సాయంత్రం భారీ బాణసంచాతో అనుపు మహోత్సవం జరుగుతుంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు కల్పించినట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి రూ.లక్ష సాయం



బాధిత కుటుంబానికి రూ.లక్ష చెక్కు అందిస్తున్న భర్నికాన సాయినాథరావు తదితరులు

సబ్బవరం: అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దంపతులకు జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భర్నికాన సాయినాథరావు మంగళవారం రూ.లక్ష అందజేశారు. వివరాలు.. మండంలోని అసకపల్లి శివారు ఎర్రవానిపాలేనికి చెందిన కోన కనకరాజు అతని భార్య కోన పైడికొండ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయాన్ని గ్రామస్తులతో పాటు యాదవ సంఘం నాయకులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే స్పందించి తన వంతు సాయం అందించారు.

15 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: పరవాడ, తానాం గ్రామాలకు చెందిన ఇద్దరు అక్రమంగా తరలిస్తున్న 15 మద్యం సీసాలను పరవాడ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. పరవాడకు చెందిన డి.యశోదకృష్ణ వైన్‌షాపు నుంచి 10 మద్యం సీసాలు, తానాం గ్రామానికి చెందిన ఎ.లక్ష్మణరావు వైన్‌షాపు నుంచి 5 మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బాలసూర్యారావు చెప్పారు.

వెండి పళ్లెం బహూకరణ



ముత్యమాంబ ఆలయ కమిటీ ప్రతినిధులకు వెండి పళ్లెం అందిస్తున్న వ్యాపారి కుటుంబం

పరవాడ: వాడచీపురుపల్లికి చెందిన వ్యాపారి గుండా పెద్ద దివాణం అర కిలో వెండి పళ్లెన్ని ముత్యమాంబ అమ్మవారికి మంగళవారం వితరణగా అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కూండ్రపు సన్యాసినాయుడు, కూండ్రపు చిన్నంనాయుడు, కూండ్రపు మధు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ గెలిస్తేనే అభివృద్ధి, సంక్షేమం



సంపతిపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మలసాల భరత్‌కుమార్



తమ్మయ్యపేట ఎన్నికల ప్రచారంలో భరత్‌కుమార్‌కు హారతిచ్చి, బొట్టు పెడుతున్న మహిళ



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు

- ప్రచారంలో దూసుకెళ్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల
- జోరుగా సాగుతోన్న వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని మరింత అభివృద్ధి, సంక్షేమాన్ని బడుగు, బలహీన వర్గాల ప్రజలు అందుకోవాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని తమ్మయ్యపేట, సంపతిపురం, మార్టూరు గ్రామాల్లో గడప గడపకు వెళ్లి మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ పైసా అవినీతి లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాలకే సంక్షేమ లబ్ధిని అందించినట్లు తెలిపారు. జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతాయన్నారు. బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్‌ను ఓడించేందుకు ధనిక వర్గాల పార్టీలు ఏకమయ్యాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కశింకోట: రాష్ట్ర అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నేత, మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని తాళ్లపాలెం, సింగవరం, జి.భీమవరం గ్రామాల్లో సోమవారం రాత్రి నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో అమలు చేసిన నవరత్నాలు, వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు వివరించాలన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని, మళ్లీ అధికారంలోకి వస్తే గ్రామాలను మరింతగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ యువజన విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, సర్పంచ్ వెంకట్, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మలసాలకు బ్రహ్మకుమారీల ఆశీర్వాదం

స్థానిక పాల కేంద్రం వద్దనున్న బ్రహ్మకుమారీల ఆశ్రమాన్ని వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ మంగళవారం సందర్శించారు. బ్రహ్మకుమారి ధనలక్ష్మిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం బ్రహ్మకుమారి భక్తులతో మాట్లాడుతూ తమకు సంపూర్ణ మద్దతివ్వాల్సిందిగా అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై గ్రామ సభ



బయ్యవరం గ్రామ సభలో మాట్లాడుతున్న సీఐ వినోద్‌బాబు

కశింకోట: ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ ఎం.వినోద్‌బాబు కోరారు. మండలంలోని బయ్యవరంలో మంగళవారం రాత్రి ఎన్నికల నియమావళిపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. తహసీల్దార్ మధుసూదన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. సభలో ఎంపీడీవో శేషుబాబు, ఎస్ఐ రమేష్‌బాబు, స్థానికులు పాల్గొన్నారు.